క్లుప్తంగా

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

సాక్షి ఇంపాక్ట్

కాట్రేనికోన: గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యపై 'సాక్షి'దిన పత్రికలో 'లోవోల్టేజీతో సతమతం'శీర్షికన ప్రచురితమైన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. చెయ్యేరు సబ్ స్టేషన్ నుంచి చిర్రయానం వెళ్లే విద్యుత్ లైన్‌ను కాట్రేనికోన సబ్ స్టేషన్ ఫీడర్‌కు కలిపి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించారు. దీంతో ఉప్పూడి, వేట్లపాలెం, రాజానగరం, నాగపట్టణం, గచ్చకాయలపోర, చిర్రయానం ప్రాంతాల లోఓల్టేజీ సమస్య పరిష్కారం అయింది.

పలువురు ఐపీఎస్ అధికారుల బదిలీ

యానాం: పుదుచ్చేరిలో వివిధ శాఖల్లో అరుణాచల్‌ప్రదేశ్,గోవా, మిజోరాం, కేంద్రపాలితప్రాంతాలు (ఎజీఎమ్‌యుటి) కేడర్‌లో సేవలు అందిస్తున్న పలువురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ మరికొంతమందిని నియమిస్తూ శుక్రవారం కేంద్రహోమ్‌శాఖ కార్యదర్శి రాఖేష్‌కుమార్ సింగ్ ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఎ నెడుంజెళియన్‌ను ఢిల్లీకి, కాటారు సోమశేఖర్ అప్పారావు లక్ష్మదీప్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా ఉప్పు కృష్ణమోహన్‌ను, అండమాన్ నికోబార్ దీవుల అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్న తెలుగు ఐఎఎస్ అధికారి ఎస్‌పిఎస్ రవిప్రకాష్‌ను, ఆర్ స్మితను, చౌదరి మహ్మద్‌యాషిన్‌ను, విక్రాంత్‌రాజాను పుదుచ్చేరికి బదిలీ చేశారు. ఐపిఎస్ అధికారి ఎకెలాల్, నిత్య రాధాకృష్ణన్ ను పుదుచ్చేరికి బదిలీ చేశారు. పుదుచ్చేరి ఐపిఎస్ తెలుగు అధికారి నర్రా చైతన్యను ఢిల్లీకి బదిలీచేశారు.

ఈవోపీఆర్‌డీ ఇందిరాదేవి మృతికి సంతాపం

తాళ్లరేవు: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ఈవోపీఆర్‌డీ సీహెచ్ ఇందిరాదేవి మృతికి పలువురు సంతాపం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన తాళ్లరేవు ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. అయితే ఆమె గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ సెలవులో ఉన్నారు. ఆమె మృతి పట్ల ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీవో కె.సత్యనారాయణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ వీజేవీ రమణ, మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా తిరుచ్చి పల్లకీ సేవ



బండారులంకలో తిరుచ్చి పల్లకీ సేవ

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసిన పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా తిరుచ్చి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన తిరుచ్చి పల్లకిపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణతో ఊరేగించారు. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మ వార్లకు మంగళ హారతులు సమర్పించారు. బండారులంక శ్రీనివాస భజన మండలి వారిచే కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. తొలుత ఆలయ అర్చకులు భీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో చింతపట్ల కృష్ణ రామ మోహనరావు, విజయలక్ష్మి దంపతులచే స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలలో అంబేడ్కర్ యూత్, శ్రీనివాసా బాలమిత్ర సంఘ ప్రతినిధులు బళ్ల సత్తిరాజు, బూడిద సత్యనారాయణ, కారుపర్తి మల్లేష్, చింతా హేమ తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయ భేదాలు మంచిది కాదు

యానాం: ఎల్జీ కె కైలాషనాథన్, సీఎం రంగసామిల మధ్య అభిప్రాయ భేదాలపై వస్తున్న వార్తలు పుదుచ్చేరికి మంచిది కాదని, ఇలాంటివి వచ్చే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయావకాశాలపై ప్రభావితం చూపుతాయని ఏఐఏడీఎంకే నేత అన్బళగన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి ఎల్జీగా కై లాషనాథన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిపాలనా వ్యవహారాలు సజావుగా సాగుతున్నాయని, అదే విధంగా ఎటువంటి అడ్డంకులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలి ఎల్జీ, సీఎం మధ్య కోల్డ్ వార్ యూటీకి మంచిది కాదన్నారు.

ఆకట్టుకున్న ఫోరెన్సిక్ ప్రదర్శన

యానాం: క్రిమినల్ చట్టాలపై అవగాహనలో భాగంగా శుక్రవారం పుదుచ్చేరి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోరెన్సిక్ ప్రదర్శన ఆకట్టుకుంది. అత్యాధునిక ఫోరెన్సిక్ పరికరాల ప్రదర్శనను ఎల్జీ కె. కైలాషనాథన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా స్నిఫర్ డాగ్స్ సహాయంతో బాంబులను గుర్తించే విధానం ప్రదర్శించారు. అదే విధంగా స్నిఫర్‌డాగ్‌ల సాహసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎం రంగసామి, హోమ్ మంత్రి నమశ్శివాయం, పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షాలినీసింగ్, హోమ్‌సెక్రటరీ కేశవన్, అసిస్టెంట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యసుందరం, అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు.. గ్రంథాలయాలు

- లైబ్రరీల్లో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలు
- పలు అంశాల్లో చిన్నారులకు శిక్షణ



పుస్తక సమీక్ష నిర్వహిస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: ప్రస్తుత కాలంలో చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతూ సాంప్రదాయ విలువలకు దూరంగా వెళ్లిపోతున్నారు. నిత్యం సెల్‌ఫోన్లతో బిజీగా గడిపే విద్యార్థులకు గ్రంథాలయాలను పరిచయం చేసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు. చిన్నారులకు తెలియని విషయాలను తెలుపుతాయి. అగ్రగామిగా నిలుపుతాయి. అనర్గళంగా మాట్లాడిస్తాయి. అందుకే పుస్తకం ఓ మంచి నేస్తం అన్నారు పెద్దలు. మే నెలాఖరు వరకు ఆయా శాఖా గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు జరుగుతున్నాయి. దీన్ని వేదికగా చేసుకుని పాఠకుల సంఖ్య, సభ్యత్వాలను పెంపొందించేందుకు గ్రంథాలయ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో ఉన్న 6 మండలాల గ్రంథాలయ సిబ్బంది కృషి చేస్తున్నారు. అమలాపురం పట్టణంలో గాంధీ బజార్‌లో శాఖా గ్రంథాలయం, అమలాపురం రూరల్ మండలలో సవరప్పాలెం, అల్లవరం మండలంలో కొమరగిరిపట్నం, అల్లవరం, గోడి, ఉప్పలగుప్తం మండంలో ఉప్పలగుప్తం భీమనలపల్లి, ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలంలో కేశనపల్లి, ఐ.పోలవరం కాట్రేనికోన మండలంలో కాట్రేనికోన, కందికుప్ప శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి.

శిక్షణ శిబిరాలు ఇలా..

ఉదయం 8 నుంచి 8.30 వరకు కథ వినడం, 8.30 నుంచి 9.30 వచకు ఆటలు, 9.30-9.40 వరకు విరామం, 9.40-10 వరకు పుస్తక సమీక్ష, 10-10.30 వరకు గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం. 10.30-11.30 వరకు స్పోకెన్ ఇంగ్లీష్/ డ్రాయింగ్/ పెయింటింగ్/ పేపర్‌క్రాఫ్ట్/మ్యూజిక్ తదితర అంశాలు నేరిస్తారు. పదిహేనేళ్ల లోపు చిన్నారులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సందర్శించి, పుస్తక పఠనంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయి. శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తారు.

అందుబాటులో వందల రకాల పుస్తకాలు..

గ్రంథాలయాల్లో పాఠకుల అభిరుచికి తగినట్లుగా వందల రకాల అంశాలకు సంబంధించి పుస్తకాలు ఉన్నాయి. రామాయణం, భారతం, భాగవతం వంటి పురాణ ఇతిహాసాలు. డిటెక్టివ్ నవలలు, కథలు, బాల సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలు, జంతు, వృక్ష, రసాయన, భౌతిక, చరిత్ర, మనో విజ్ఞాన శాస్త్రాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ఏపీపీఎస్సీ, బీఎస్ఆర్‌బీ, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పుస్తకాలు. గణితం, గణాంక, సామాజిక, ఆర్థిక శాస్త్ర పుస్తకాలు, దిన, వార, మాస, పత్రికలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాస రచన, వక్తృత్వం పోటీలు, రంగవల్లులు, చిత్రలేఖనం పోటీలు జరుపుతున్నారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిచనున్నారు.

విద్యార్థులు ఆకర్షితులవుతున్నారు..



వేసవి విజ్ఞాన శిబిరాల వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. గ్రంథాలయానికి వచ్చేలా విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నాం. వారికి నచ్చే కథల పుస్తకాలు, డ్రాయింగ్ తదితర వాటికి ఆకర్షితులై రోజు సుమారు 50 మంది వరకు విద్యార్థులు వస్తున్నారు.

– నైనాల వెంకట నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి, శాఖా గ్రంథాలయం, సవరప్పాలెం, అమలాపురం మండలం

వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన



ఆర్టీసీ బస్టాండ్‌లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న బురక్రథ కళా బృందం

అమలాపురం రూరల్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ దిశా ప్రివెన్షన్ యూనిట్ అధ్వర్యంలో శుక్రవారం బురక్రథ కల్చరల్ ఈవెంట్స్ కళా బృందం వారిచే హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అమలాపురం బస్టాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ ఎలా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా జీవించాలి, సుఖవ్యాధులు, చికిత్స గురించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఆర్‌ఈ కౌన్సిలర్ కవిత, జనకళ్యాణ్ టీఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శ్రీను, ఆశ కార్యకర్తలు, జనకళ్యాణ్ ఉద్యోగులు సత్యనారాయణ, జ్యోతి, శ్రీనివాస్, ఏఎన్ఎం రమణి, పీర్ ఎడ్యుకేటర్లు అమల, శ్యామల, రామలక్ష్మి, కమ్యూనిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు అవగాహన కల్పించడం అభినందనీయం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

ముమ్మిడివరం: యువతకు సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించడం అభినందనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు అన్నారు. ముమ్మిడివరంలో యూత్ కెపాసిటీ బిల్డింగ్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగేశ్వరరావు హాజరయ్యారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ సహాయ సహకారాలతో కార్లెట్ సిస్టర్స్ ఆఫ్ థెరిసా, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, సత్యం చారిటబుల్ ట్రస్టు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానిక మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన ముగింపు సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలుఇటు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి యువతను చైతన్యపరచడం మంచి పరిణామన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ ఏపీ, తెలంగ కోఆర్డినేటర్ జి.కరుణారావు, పుల్లెపు వెంకటేశ్వరరావు, జైబీమ్ చంద్ర పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఎన్.సంజయ్, ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంధం సిస్టర్స్ నృత్య ప్రదర్శన



గంధం సిస్టర్స్ తనుశ్రీ, బ్రహ్మణి

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లికి చెందిన (ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న) చిన్నారులు గంధం సిస్టర్స్ తనుశ్రీ (8), బ్రహ్మణి (5) కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యులు. నృత్యంలో 10 ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్న వీరు అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి ఎ కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ అయిదు రకాల నృత్య ప్రదర్శనలు చేయనున్నారు. ఇదే వేదికపై కూచిపూడి ఆరంగ్రేట మహోత్సవాన్ని కూడా నిర్వహించనున్నారు. కూచిపూడి, భరత నాట్యం, పేరణి, ఫోక్ (జాన పదం), రాజస్థాన్ జానపద నృత్యం ఇలా అయిదు రకాల నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు. నాట్య గురువు, సత్యభామ అవార్డు గ్రహీత సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో గంధం సిస్టర్స్ నిర్వహించబోయే నృత్య ప్రదర్శనకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా కో ఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి రంగా న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారని ఆ చిన్నారుల తల్లిదండ్రులు గంధం ఆదినారాయణ, దేవి దంపతులు తెలిపారు. తండ్రి ఆదినారాయణ ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా రైటర్‌గా పని చేస్తున్నారు. నృత్యాభిమానులు ఈ నృత్య ప్రదర్శనను తిలకించి తమ పిల్లలను ఆశీర్వదించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

కోనసీమ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి సత్తిబాబు

అమలాపురం టౌన్: కోనసీమ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని, జిల్లా ఏర్పడిన నాటి నుంచి కోనసీమ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని సీపీఐ జిల్లా ఇన్‌చార్జి డేగా ప్రభాకర్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ ప్రతినిధి పెద్దిరెడ్డి రాము అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. సీపీఐ నేత తాటిపాక మధు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ కోనసీమ వ్యవసాయ ఆధారిత జిల్లా కాబట్టి ఆ దిశగా అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకతను వివరించారు. పారిశ్రామిక అభివృద్ధికి కోనసీమ నూరు శాతం అనువైనదని పేర్కొంటూ ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో నేటి ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. కోనసీమ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశంపై ఈనెల 25న అమలాపురంలో జరగనున్న సదస్సులో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి సత్తిబాబు అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దేవా రాజేంద్రప్రసాద్, కె.రామకృష్ణ, జి.రవికుమార్ తదితరులు మాట్లాడారు.

సచివాలయ భవనం ప్రారంభం

అమలాపురం రూరల్: మండలంలో రోళ్లపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ మట్ట వైదేహి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, ఎంపీడీవో ఉండ్రు బాబ్జీ రాజు, కార్యదర్శి సుజాత, దాసం మురళి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం.. కౌలు రైతుకు తీరని నష్టం



చెరువులో చనిపోయిన చేపలను చూపుతున్న కౌలు రైతు సురేష్‌బాబు

తాళ్లరేవు: భూ యజమానుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా కౌలు రైతుకు తీవ్ర నష్టం సంభవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పటవల గ్రామ పంచాయతీ ఈబీసీ కాలనీ సమీపంలో ఉన్న చెరువులను అదే గ్రామానికి చెందిన పొట్టిపోతుల సురేష్‌బాబు (నాని) అనే కౌలు రైతు సాగు చేస్తున్నాడు. వరుసకు మావయ్య అయిన ఆలపాటి శ్రీనివాసరావు అనే వ్యక్తి వద్ద లీజుకు తీసుకుని గత 12 ఏళ్లుగా చేపల చెరువు సాగు చేస్తున్నాడు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చేపల సాగు చేపట్టాడు. అయితే ఆ చెరువును తాను కొన్నానని ఖాళీ చేయాల్సిందిగా రాంబాబు అనే వ్యక్తి గత 20 రోజులుగా వత్తిడి చేస్తున్నారు. తనకు లీజుకు ఇచ్చిన వ్యక్తి అనారోగ్యం కారణంగా బెంగళూరులో చికిత్స పొందుతున్నారని, ఆయన వచ్చి చెప్పిన తర్వాత ఖాళీ చేస్తానని సురేష్‌బాబు తెలిపారు. గత మూడు నెలలుగా చేపల సాగుకు సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశానని, మరో మూడు నెలల్లో పంట చేతికి వచ్చాక చెరువును ఖాళీ చేస్తానని, లేకపోతే తీవ్రంగా నష్టపోతానని కౌలు రైతు చెప్పాడు. అయితే చెరువును కొనుక్కున్న వ్యక్తి ససేమిరా అనడంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కొంత మంది వ్యక్తులు చెరువులో నీటిని దౌర్జన్యంగా ఇంజన్లతో తోడేయడంతో చెరువులో ఉన్న చేపలు మృత్యువాత పడ్డాయి. భూ యజమానుల తీరుతో తాను తీవ్రంగా నష్టపోయానని కౌలురైతు సురేష్‌బాబు శుక్రవారం విలేకరుల వద్ద బోరున విలపించాడు. అధికార యంత్రాంగం స్పందించి తనకు న్యాయం చేయాలని కౌలురైతు కోరుతున్నాడు. ఇలా ఉండగా సర్వే నంబరు 380-1బిలోని 53 సెంట్ల భూమిని తాను కొనుగోలు చేసానని, అయితే ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చల్లా రాంబాబు అనే వ్యక్తికి విక్రయించినట్లు ఆలపాటి సతీష్‌కుమార్ తెలిపారు. ఆ భూమికి సంబంధించిన పత్రాలన్నీ తమ వద్ద ఉన్నాయని, గత కొన్ని రోజులుగా కోరుతున్నప్పటికీ చెరువును ఖాళీ చేయకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సతీష్‌కుమార్ ఆరోపించారు.

ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ



ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న యువకులు, మహిళలు



తిరంగా యాత్రలో పాల్గొన్న ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే ఆనందరావు, అఖిలపక్ష నాయకులు, ప్రజలు

యానాం: పెహల్గాంలో అమాయకులైన పర్యాటకుల ప్రాణాలు తీసిన ఘటనకు జవాబుగా ఉగ్రమూకలు నక్కిన శిబిరాలపై దాడులు నిర్వహించేందుకు భారతసైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినందుకు శుక్రవారం యానాం ప్రజల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ చిన్నా సెంటర్, విష్ణాలయం వీధి, ఆర్‌ఏవో ఆఫీసు వీధి తదితర ప్రాంతాల మీదుగా సాగింది. యువకులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కనకాలరాజు, ఏఐఏడీఎంకే కార్యదర్శి మంచాల సాయి, సబ్బతి లోకేష్, కనకాల రామదాసు, కవల బాబులు, నాని, కవల తిరుమలనాయుడు, ఫిరోజ్, దంగుడుబియ్యం సత్యనారాయణ, కూనం రెడ్డి సూరిబాబు, నల్లం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సగర్వంగా తిరంగా యాత్ర

అమలాపురం టౌన్: ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ దేశానికి, ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు, ప్రధాని మోదీకి సంఘీభావంగా అమలాపురం పుర వీధుల్లో అఖిల పక్షం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తిరంగా (జెండా) యాత్ర సగర్వంగా సాగింది. 350 మీటర్ల జాతీయ జెండాను ప్రజలు స్థానిక గడియారం స్తంభం సెంటరు నుంచి నల్లవంతెన వరకూ దాదాపు కిలోమీటరుకు పైగా ఊరేగించారు. ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు మానేపల్లి అయ్యాజీ వేమా, నల్లా పవన్‌కుమార్, అడబాల సత్యనారాయణ, మోకా వెంకట సుబ్బారావు, టీడీపీ, జనసేన నాయకులు చిక్కాల గణేష్, నల్లా శ్రీధర్‌తో పాటు పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, బోణం సత్య వర ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, భజరంగ్ దళ్ ప్రతినిధి శిరంగు నాయుడు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళలు ఈ తిరంగా యాత్రలో భాగస్వాములయ్యారు.

కిడ్నీ బాధితురాలికి దళిత సేన ఆర్థిక సాయం



అశ్వితకు ఆర్థిక సాయం చేస్తున్న దళిల సేన నాయకులు

అమలాపురం రూరల్: ముమ్మిడివరం నియోజకవర్గం గేదెల్లంక గ్రామానికి చెందిన గుత్తాల అశ్విత అనే 18 ఏళ్ల యువతి పుట్టుక నుండి కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. ఆపరేషన్ చేయించుకోవడానికి సుమారు రూ. 4 లక్షలు ఖర్చవుతుంది. ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది గాని కొంతవరకే. ఈ నేపథ్యంలో కిడ్నీ మార్పిడికి ఆర్థిక సహాయం కోరుతున్నారు. ఆమెకు తల్లి కిడ్నీ దానం చేస్తున్నారు. దళిత సేన అధ్యక్షుడు డేవిడ్ అంబేడ్కర్‌ను కలిశారు. ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, దళిత సేన సభ్యులకు తెలియజేసి ఆర్థిక సహాయం కోరారు. మానవతా దృక్పథంతో రూ. 15 వేలు గుత్తాల అశ్వితకి శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో సాపే రమేష్, వాకపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు గలగల.. నేడు వెలవెల



ప్రమాదకరంగా మారిన స్విమ్మింగ్‌పూల్



గతంలో స్విమ్మింగ్‌పూల్ వద్ద చిన్నారుల సందడి (ఫైల్)

- ఎవరికీ పట్టని స్విమ్మింగ్‌పూల్
- నాచుతో నిండి ప్రమాదకరంగా మారిన వైనం
- వేసవిలో ఈతకు వస్తున్న చిన్నారుల ఆనందం ఆవిరి

యానాం: వేసవి సెలవులు వచ్చాయంటే పట్టణ పరిధిలో డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం చెంతనే ఉన్న స్విమ్మింగ్ పూల్ చిన్నారులు, బాల, బాలికలతో సందడిగా కనిపించేది. కాని ప్రస్తుతం దాని నిర్వహణ లేకపోవడం, నీరంతా ప్రమాదకరంగా తయారై నాచు, పచ్చగా మారడంతో స్విమ్మింగ్ చేయడానికి, నేర్చుకోవడానికి వస్తున్న వారంతా నిరాశతో వెనుదిరుగుతున్నారు. గతంలో ఈ స్విమ్మింగ్ పూల్‌ను సీఎస్ఆర్ నిధులతో రిలయన్స్ సంస్థ నిర్మించింది. ఆ విధంగా దానికి కావాల్సిన ఫిల్టర్లు తదితర సౌకర్యాలు కల్పించింది. అయితే నిర్మించి సుమారు పదేళ్లకు పైగా కావడంతో ఫిల్టర్లు దెబ్బతినడం, ప్లాస్టిక్ పైపులు పాడవడం తదితర సమస్యలతో నీరు కాస్త మురికి కూపంలా మారిపోయింది. చిన్నారులు వెళ్తే అనారోగ్యం బారిన పడతారని వారికి సిబ్బంది ఈత నేర్పే కార్యక్రమాన్ని విరమించుకున్నారు. ప్రస్తుతం స్విమ్మింగ్‌పూల్ నియంత్రణ బాధ్యత స్థానిక పరిపాలనాధికారి ఆధ్వర్యంలో ఉందని తెలిపారు. తాత్కాలిక పనులకు సుమారు రూ.లక్ష ఖర్చు చేస్తే క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టవచ్చునని అంటున్నారు. మొత్తం బాగు చేయించాలంటే రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుందని అన్నారు. వేసవి సెలవులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే చిన్నారులు స్విమ్మింగ్‌పూల్‌కు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశుభ్రతతోనే డెంగీ నివారణ



కేసనకుర్రు పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో డెంగీపై ర్యాలీ

ఐ.పోలవరం: పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీని విజయవంతంగా నివారించవచ్చని కేశనకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ కె.రాజేష్ బాబు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. డెంగీని ఓడించండి.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి అని వారు నినాదాలు చేశారు. వైద్యులు డాక్టర్ ఎం.అనూషా, మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.ఎస్.వి.రాజ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో ఎం.వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ కె.రమేష్, ఎం.సూర్యకుమారి, ఆస్పత్రి సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు రెండు ప్రత్యేక బస్సులు



సరస్వతీ నది పుష్కరాలకు వెళుతున్న భక్తులు, బస్సులు

రావులపాలెం: సరస్వతీ నది పుష్కరాలకు రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు వెళుతున్నట్టు శుక్రవారం డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాల దర్శనాలతో పాటు సరస్వతీ నదిలో యాత్రికులు పుష్కర స్నానం ఆచరించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.